# ప్రశ్నలు & సమాధానాలు
# ప్రశ్న 321: శ్రీ కృష్ణుని మీద ఉన్న మరి కొన్ని అపార్థాలపై విశదీకరణ
# మే 25, 2024

ఈ ప్రశ్న-సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 2, పేజీలు 366-373 నుండి తీసికొనబడినవి

**స్వామి! కృష్ణునికి ఎనిమిది భార్యలు, 16,000 గోపికలు ఉండే వారని వింటుంటాం. కృష్ణుని భార్యల గురించి వింటే ఇబ్బందిగానూ, సిగ్గుగానూ అనిపిస్తుంది. దయచేసి ఈ విషయం గురించి విశదీకరించి చెప్పండి.**

**భగవాన్:** ఇదంతా మీరు సినిమాలు చూసి నేర్చుకున్న విషయాలా? మీకు తెలిసిన కృష్ణుడికి భాగవతంలోని కృష్ణుడుకి చాలా తేడా ఉంది. ఇటువంటి వికృతమైన కృత్రిమ భావనల వల్లనే ఈనాడు భక్తి తగ్గి, నాస్తికులు ఎక్కువౌతున్నారు. అద్వైతమైన నిత్యసత్యమును క్షణికమైన, అశాశ్వతమైన, లౌకికమైన భావనలతో గమనిస్తున్నారు. ఇది ఆధునిక కాలంలో వచ్చిన దురదృష్టపు పరిస్థితి. ఈ ప్రపంచమే ఒక దైవ సాక్షాత్కారము, కానీ భగవండిని కూడా ప్రాపంచిక దృష్టితో భావించాలి అని మన పురాణాలు చెబుతాయి. భగవంతుడు నిర్బంధుడు. నిన్ను బంధ విముక్తుణ్ణి చేయు వాడు భగవంతుడు ఒక్కడే.

కృష్ణుడి ఎనిమిది భార్యలు ఎవరు? ప్రతి జీవి హృదయం అష్టదళ పద్మం వంటిది. ఈ అష్ట దళాలే ఎనిమిది భార్యలు. మానవ దేహంలో ఏడు చక్రాలు ఉంటాయి. వెన్నెముక అడుగున ఉన్న చక్రం పేరు మూలాధార చక్రం. తల పైన ఉండే ఏడవ చక్రం పేరు సహస్రార చక్రం. సమాధి స్థితిలో ఉన్నపుడు కుండలిని శక్తి మూలాధార నుండి సహస్రార వరకు ప్రయాణిస్తుంది. సహస్రార చక్రమును వెయ్యి దళములున్న పద్మముతో పోల్చవచ్చు. ఒక్కొక్క దళమునకు 16 కళలు ఉంటాయి. అన్నీ కలిపితే 16,000 అవుతాయి. అవే కృష్ణుని గోపికలు అనుకుంటారు.

నిజానికి, బృందావనంలో ఉన్న సమయంలో కృష్ణుడు బాలుడు మాత్రమే. గోపికలందరూ పెళ్లైన పెద్ద వారు. వారి పిల్లలతో ఎలా ఆడుకుంటారో అదే విధంగా కృష్ణునితో కూడా ఆడుకొనే వారు. ఆ గోపికలకు ప్రపంచమంతయూ కృష్ణుడు వ్యాప్తించినట్లు కనబడేది. వారి నుదుటి బొట్టు నీలమైనది ఉండేది. వారు నీలం రంగు గాజులు, చీరలు ధరించేవారు. వారు ఉపయోగించే ప్రతి వస్తువు నీలంగా ఉండేది. ఎందుకంటే కృష్ణుడు నీల వర్ణుడు కనుక. నారదుడు వంటి దేవతల కంటే ఎక్కువ భక్తి పారవశ్యంతో పాడే వారు. వారి భర్తలపై కంటే కృష్ణునిపై ఎక్కువ ప్రేమ ఉండేది ఈ గోపికలకు. ఎల్లప్పుడూ కృష్ణ వైభవం గురించి పాడుకుంటూ ఆనంద పారవశ్యములలో మునిగి తేలుతుండే వారు. కృష్ణుని నుండి ఒక్క నిమిషం దూరమైనా పరితపించి పోయే వారు. వారి ప్రియమైన కృష్ణుడు మధురకు వెళ్ళినపుడు ఈ గోపికల దేహాలు భరించలేని తాపంతో, వ్యాకులతతో బాధ పడే వారు. అక్రూరుడిపై నిందారోపణలు వేసే వారు. వారిది ఆత్మానందం. మీ తలపులు ప్రాపంచిక, సంసార సంబంధమైనవి. కనుకనే ఇటువంటి సూక్ష్మమైన విషయాలను అవగాహన చేసుకోలేక సంకుచిత దృష్టితో భావిస్తారు. నిజము చెప్పాలంటే ఆ గోపికలకు ఉన్న అపారమైన భక్తి ఎవ్వరికీ అర్థం కాదు, అంచనా వేయలేరు. కృష్ణునిపై వారికున్న భక్తి మానవ మాత్రులకు అర్థం అవనంత అపారమైనది, అగాధమైనది.

స్వామి! రాధ కృష్ణుడికి గాఢమైన, ఆదర్శవంతమైన భక్తురాలు, ఆత్మీయురాలు. ఆమె నిరుపమానమైన, సంపూర్ణమైన అనన్య భక్తికి పెట్టిన పేరు. మీరు రాధ భక్తి గురించి మాట్లాడినప్పుడు మేము కూడా భక్తి పారవశ్యంలో మునిగిపోతాము. రాధ భక్తి గురించి మళ్ళీ చెప్పండి.

భగవాన్: భక్తి అంటే పుస్తకములు చదివితే వచ్చేది కాదు. ఏ గురువు దగ్గర నేర్చుకోనేది కాదు. ఏ స్నేహితుడు భక్తిని బహుమతిగా ఇవ్వలేడు. అది మనసులో పుట్టాలి. మనసులో దూర్చడానికి అవ్వదు. గోపికల భక్తి నిర్మలమైనది, నిస్వార్థమైనది, నిశ్చలమైనది, ధృడమైనది, స్థిరమైనది. వారందరిలోకి రాధ ప్రముఖురాలు. కృష్ణుడితో ఏకత్వ భావనలో, తదాత్మ్యంలో ఉండేది. రాధకి ఎప్పుడూ కృష్ణ తృష్ణ మాత్రమే, లోక తృష్ణ లేనే లేదు.

ఒక రోజు కృష్ణుడు రుక్మిణితో రథంలో పక్క ఊరికి వెళ్ళాడు. అక్కడి ప్రజలందరూ చేరి వారిని సాదరంగా, ఉత్సాహంగా ఆహ్వానించారు.

కృష్ణుడు ఒకామెను రెప్ప వేయకుండా చూడడం చూసింది రుక్మిణి. ఆమె కూడా కృష్ణుని వైపు పదే పదే చూస్తోంది. కృష్ణుడు మెల్లగా చెప్పాడు, "రుక్మిణి, నీకు రాధ తెలుసా? నా ఆత్మీయ భక్తురాలు." అది వినగానే రుక్మిణి రథం దిగి, రాధ దగ్గరకు పరిగెత్తి, అదీ ఇదీ మాట్లాడి, ద్వారకకు రమ్మని ఆహ్వానించింది.

అలాగే మరుసటి రోజు రాధ ద్వారకకు వెళ్ళింది. రుక్మిణి ద్వారము వద్దకు వచ్చి రాధను అంతఃపురంలోనికి తీసుకొని వెళ్ళింది. రాధ అంతఃపురంలో రుక్మిణితో కొంచెం సేపు కూర్చొని కృష్ణుని గురించి మాట్లాడుకొని, పాటలు పాడుకొన్నారు. కృష్ణునితో వారి వారి అనుభవాల గురించి ముచ్చటించుకున్నారు. రుక్మిణి రాధకు వేడి వేడి పాలు ఇచ్చింది. వేడిగా ఉంటే మెల్లిగా తాగుతూ కృష్ణుని గురించి ఇంకా ఎక్కువ సేపు ముచ్చటించుకోవచ్చు అనే ఉద్దేశంతో. కానీ రాధ వేడి పాలను అంతా వెంటనే తాగేసింది. అయినా కూడా ఇంకొంచెం సేపు కబుర్లు చెప్పుకొని రాధ తన గ్రామానికి దారి తీసింది.

సాయంకాలం కృష్ణుడు అలసిపోయి వచ్చాడు. రుక్మిణితో అన్నాడు, "రుక్మిణి, నేను బాగా అలసిపోయాను. నా పాదాలలో మంటలు భరించలేకున్నాను." రుక్మిణి కృష్ణుని పాదాలలో బొబ్బలు చూసి ఎలా వచ్చాయి అని అడిగింది. అప్పుడు కృష్ణుడు చెప్పాడు, "రుక్మిణి, రాధ వచ్చినప్పుడు నువ్వు వేడి వేడి పాలు ఇచ్చావు ఆమెకు. రాధ ఆ పాలన్నీ ఒక్క గుక్కలో తాగేసింది. నా పాదాలు ఆమె హృదయంలో ఉండడం వల్ల ఆ వేడి వేడి పాలు నా పాదాలపై పడి బొబ్బలు కట్టి మండుతున్నాయి." రాధ భక్తి అటువంటిది.

ఒక రోజు, రాధ భక్తిని పరీక్షించడానికి ఇంకొక గోపిక ఒక చిల్లుల కుండ చేతికిచ్చి యమునా నదిలో నీరు తీసుకొని రమ్మంది. రాధ అది చిల్లుల కుండ అని చూసుకో లేదు. నదిలో కుండ నింపుకుంటుండగా పదే పదే కృష్ణ నామం తలచుకొంది. ఒక్కొక్క సారి కృష్ణ నామం తలచినప్పుడు ఒక్కొక్క చిల్లు పూడుకుపోయింది. ఇంక ఆ కుండ కారకపోవడంతో నిండు కుండతో తిరిగి వచ్చింది! రాధ భక్తి అటువంటిది.

రాధ పేరులో 'ర' అంటే రాధ, 'ఆ' అంటే ఆధారం, 'ధ' అంటే ధార, 'ఆ' అంటే ఆరాధన. ఆమె భక్తి ధార వలె నిరంతరమైనది. రాధ కృష్ణుని పేరు ఎన్ని సార్లు తలచుకుంటే కృష్ణుడు కూడా రాధ పేరు నిరంతరమూ తలచుకొనే వాడు. అదే భగవంతునికి, భక్తురాలికి ఉండే అవినాభావ సంబంధం.

స్వామి! కృష్ణుని అపారమైన కరుణ వల్ల పాండవులు ఎన్నో కష్టాలు, నష్టాలు, ఆందోళనలు తట్టుకోగాలిగారు. భగవంతునికి భక్తుని పై ఉండే దయ, కరుణల గురించి వింటే ఎంతో సంతోషంగా ఉంటుంది. దయచేసి ఒక సన్నివేశం గురించి చెప్పండి.

భగవాన్: అవును, అవును, అవును. ఇది సత్యస్య సత్యం. భగవంతుడు ప్రేమిస్తాడు అని అనడం సరి కాదు. ***God is Love, Love is God, Live in Love.*** ఎలా? మీరు ఒక్కరినో ఇద్దరినో ప్రేమించవచ్చు. కానీ మీరే ప్రేమగా మారిపోతే, మీరే ప్రేమ అయితే, అదే అనంతం అయిపోతుంది, అందరినీ ప్రేమించవచ్చు. కనుక ప్రేమికుడు అవకు, ప్రేమగా మారిపో. భగవంతుడు ప్రేమ స్వరూపం కనుక ప్రేమ ద్వారా మాత్రమే అనుభవించవచ్చు. చంద్రుడిని వెన్నెల లోనే చూడగలం కదా. అదే విధంగా, ప్రేమ ద్వారానే భగవంతుని అనుభవించి ఆనందం పొందవచ్చు.

కృష్ణుని అనుగ్రహం వల్లనే పాండవులు అన్ని కష్టాలు ఎదుర్కో గలిగారు. వారికి కృష్ణునిపై గల నిస్వార్థమైన ప్రేమ, త్యాగం వల్లనే అన్ని ప్రమాదకరమైన పరిస్థితులు, అపాయకరమైన గండాలు ఎదుర్కొన గలిగారు. వారిని రక్షించడానికి కృష్ణుడు ఏమి చేయడానికైనా సిద్ధమే.

ఒక సారి పాండవులు, ద్రౌపది, కుంతీలతో పాటు అరణ్యంలో విహారానికి వెళ్ళినప్పుడు ఒక పెద్ద పండును చూసారు. ఆ పండు అందరూ పంచుకున్నా భోజనానికి సరిపోయేటంత పెద్దది. ద్రౌపది వెళ్ళి ఆ పండును కోయడానికి ప్రయత్నించింది కానీ అవలేదు. ధర్మరాజు ఆమెకు సహాయం చేయడానికి వెళ్ళాడు కానీ ఆయన తరమూ అవలేదు. వారిద్దరూ అలసిపోయారు. ధర్మరాజు, ద్రౌపది ఇంకా రాలేదేమి అని వెతకటానికి భీముడు, అర్జునుడు వెళ్ళి చూసారు. వారు కూడా ఆ పండును ఎత్తడానికి ప్రయత్నించారు కానీ వారూ విఫలమయ్యారు. చివరికి నకులుడు, సహదేవుడు కూడా వారిని కలిసారు. అందరూ కలిసి ఎత్తడానికి ప్రయత్నించినా అవలేదు. అప్పుడే వారి పాదాల కింద ఏదో కదలిక కనబడింది. నల్లటి జుట్టు భూమి అంతా కప్పబడి ఉంది. తలలెత్తి ఎవరిదా ఈ జుట్టు అని చూస్తే దూరంలో ఒక ఋషి తపస్సు చేసుకుంటూ కనబడ్డాడు. ఆ ఋషి పేరు రోమర్షి.

ఆ ఋషి కళ్ళు తెరవబోతున్నాడు. ఈ పండు కొరకు ఎన్నో రోజుల నుంచి తపస్సు చేస్తున్నాడు. అది తింటే ఆకలి దాహముల నుండి విడుదల కాగలడు. ఆ పండును తీసుకోవాలనుకున్న పాండవులు తప్పు చేసిన్నట్టు అర్థమయ్యింది. ఆ ఋషి వారిని శపిస్తాడేమో అని భయపడ్డారు. ద్రౌపది వెంటనే వారిని రక్షించమని కృష్ణుని ప్రార్థించింది.
కృష్ణుడు ఆమె ఎదురుగా ప్రత్యక్షమయ్యి సమస్య ఏమిటని అడిగాడు. "ద్రౌపది, నేను నా భక్తులను రక్షించడానికి వస్తాను నిజమే, కానీ నేను ఋషిమనససంచారి కూడా, అంటే భక్తుల హృదయాలలో నివసించి ఉంటాను. మీరు చేసినది తప్పు. రోమర్షి ఆ పండు కొరకు ఎంతో తపస్సు చేస్తే మీరు తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. కోపం వచ్చి ఆ ఋషి మిమ్మలను శపిస్తే నేను ఏమి చేయగలను?"

ద్రౌపది వెంటనే కృష్ణుని పాదాలపై పడి, "ప్రభూ, మాకు ఇంకెవరూ లేరు. నువ్వు లేకుంటే మేము ఈ విధంగా బ్రతికి ఉండ గలిగే వారము కాము. మా తప్పులను ఒప్పుకుంటున్నాము. దయచేసి క్షమించి ఆ ఋషి యొక్క శాపము నుండి తప్పించండి."

అప్పుడు కృష్ణుడు, "సరే, కానీ నేను చెప్పినట్లు చేయండి. నేను వెళ్ళి రోమర్షితో మాట్లాడుతాను. మీరు సరిగ్గా పది నిమిషాల తర్వాత రండి," అని చెప్పాడు.

కృష్ణుడు వెళ్ళిన వెంటనే రోమర్షి ఎంతో భక్తి శ్రద్ధలతో ఆహ్వానించి, “ప్రభూ! మేము మీ దగ్గరకు రావాలి. మా తపస్సులన్నీ మీ సన్నిధి చేరుకోడానికే. ఈ భాగ్యమును ఎలా స్వీకరించను? భగవంతుడివే నన్ను చూడడానికి వచ్చావు!” ఆ విధంగా కృష్ణుడు అతనితో పది నిమిషాలు మాట్లాడిన తర్వాత పాండవులు వచ్చారు. అప్పుడు కృష్ణుడు వారికి ఒక్కొక్కరికీ పాదనమస్కారం చేసాడు, ద్రౌపదితో సహా. అది చూసి రోమర్షి ఈ పాండవులు మహా గొప్ప ఋషులు అయి ఉంటారని భావించాడు. రోమర్షి కూడా వారందరికీ పాదనమస్కారం చేసాడు. అప్పుడు అతని క్రోధం శాంతించింది. తానే స్వయంగా నమస్కరించిన వారిని శపించలేడు కదా.

ఈ సన్నివేశం భగవంతునికి తన భక్తుల పై ఉన్న అపారమైన ప్రేమను చూపుతోంది. తన భక్తులను రక్షించడం కొరకు ఎంత దూరం వెళ్ళతాడో కనిపిస్తోంది. కానీ భక్తులు కూడా ఆ దయకు అర్హులై ఉండాలి.

అనిల్ కుమార్ గారు వచ్చే వారం మరిన్ని భగవాన్ బాబా వారి భక్తి పూర్వకమైన కథలు మనతో పంచుకుంటారు. ధన్యవాదములు.

ఓం సాయి రాం